# లేఖ

శ్రీమతి సి. వి. రమణమ్మగారు

కమలకు:—

ఎన్నిరోజులనుంచో నీకు ఉత్తరం వ్రాయాలని; కాని పనితొందరవల్ల పడడంలేదు. ఇవ్వేళ సావకాశంగా కూర్చొని వ్రాద్దామనుకున్నాను.

నీవు మాఇంటి ప్రక్కనున్న సుబ్బును ఎరుగుదువుకదూ; ఆసన్నటి పొడుగాటి అమ్మాయి? చిన్నతనంలో నిన్నూనన్నూ చూచి "మీ కేమమ్మా బాగా చదువు కుంటారు" అని అంటూ తన దౌర్భాగ్యానికి తానే చింతిస్తూ మనవైపు విచారంగా చూచేది. ఈనాడు తలచుకుంటే కమలంలా నవకోమలమైన స్త్రీ హృదయాన్ని భేదించగల ఆనాటి చూపులైనా జ్ఞాపకం రాక మానవు నీకు.

అలాటి అమాయకురాలు అతి కష్టం మీద సంసారసాగరాన్ని ఈదుతూ భాధపడుతూ ఉంటే చూడడానికి నాగుండె తరుక్కుపోతుంది. ఆవిడకు అందులో ఇద్దరు ముగ్గురు పిల్లలు. ఆ అల్పవయస్సులో వాళ్ల కందరకూ చాకిరీచేస్తూ విసుగుకుంటూ ఉన్నప్పుడు ఆవిడ జీవితంలో కాంతి, వెలుగు మాయమైపోయి సర్వము అంధకారమయమైనట్టు భావిస్తుంది. నిరాశ ఆవిడ ముఖాన ప్రళయ తాండవముచేస్తూ ఉంటుంది.

పాపం ఆపిల్లలు గాలికి పెరుగుతున్నారు. అందులో పెద్దకుఱ్ఱవాడికి ఆరు ఏడు ఏళ్లుంటాయి. ఆవయస్సులో విషయ సంగ్రహణం కోసరం బాలహృదయం ఎంత కుతూహల పడుతుందో ఎంత పరితపిస్తుందో నీవు ఊహించుకోగలవు అని అనుకుంటాను.అతను అలా తల్లిని విసిగిస్తుంటే అబ్బ ఎన్ని దెబ్బలు కొడుతుంది. ఎంతో ఆనందంగా నిర్విచారంగా ఆటలాడుకొనేవాడు అతను. ఇప్పుడు చూస్తే అతని కళ్లల్లోవిరక్తి జీవితంమీద లెక్కలేనితనమూ కన్పిస్తూనే ఉంటాయి. ప్రొద్దున్న వెళ్లి కాయకష్టంచేసి రాత్రి పిల్లలందరూ పడుకున్నతరువాతగాని రాడు వాళ్లనాయన. ఇలాటి సమయంలో ఆపిల్లలు ఏంచేస్తారు? ఏడుపు మరచిపోయేవరకు ఏడుస్తారు. కొంతసేపటికి మళ్లీ రంగంలోకి దూకుతారు. అన్నీ మళ్లీ మామూలే.

ఆకుఱ్ఱవాడిపేరు రాము. ఒకరోజున నేను చూస్తూనే ఉన్నాను. వాళ్లింటి అరుగుమీద చేతిలో ఒక బెత్తం పట్టుకొని కూర్చుని ఉన్నాడు. ఆ ప్రాంత్యాలంతా శుభ్రం చేసికొన్నట్టున్నాడు. ఎక్కడికో బయలుదేరుతూ "ఎవరూ కూర్చోకూడదిక్కడ. కూర్చుంటేనా........." అని కళ్లెఱ్ఱచేస్తూ బెత్తం తనస్థలంలో ఉంచాడు. కొంతసేపటికి ప్రక్కింటి సీత వచ్చి పంతానికి అక్కడే కూర్చుంది. "సీతా, నా స్థలమది. బెత్తం పెట్టుకున్నానమ్మాయ్" అంటూ వచ్చాడు రాము. ఆ అమ్మాయి లేవలేదు. పైగా ఆ బెత్తాన్ని క్రింద పారవేసింది. అత

నీక సహించలేక "లేస్తావా, లేవవా?" అంటూ ఉగ్రుడైపోయాడు. "సరేలే, నే లేవేలే"నని మూతిబిగించుకొని కూర్చుంది సీతి. రెండు చేతులుపట్టుకొని ఒక బంతిని గిరవాటువేసినట్టు గిరవాటువేసేశాడు ఆ అమ్మాయిని. ఆ అమ్మాయి పెద్దగా ఏడుస్తుంటే ఆ అమ్మాయి అన్నయ్యట, ఏడు ఏళ్లుంటాయి, రాముమీద కలబడసాగేడు. పాపం, "నే నూరకే కొట్టలేదోయి, నా స్థలం తీసికొంది" అంటూ శాంతంగా చెప్పేడు రాము. అతను మీదమీదకు వచ్చి కొట్టసాగేడు. ఆ దెబ్బలాటలో ఆ కుఱ్ఱవాడితొడ కొరికివేశాడట. "అమ్మో, అమ్మో" అంటూ బిగ్గరగా ఏడుస్తూ పరుగులెత్తసాగేడు ఆ కుఱ్ఱాడు. ఆ కుఱ్ఱవాడితల్లి విధికెక్కి రామును అతని తల్లిదండ్రులను తన ఇష్టమువచ్చినట్టు తిట్టసాగింది. రాము తల్లి సుబ్బు భరించలేక ఆనాడు రామును కొట్టిన దెబ్బలు తలచుకుంటే ఏనాటికైనా అనవసరంగా దెబ్బలు తింటూ ఏకధారగా కన్నీళ్లు కారుస్తూ నిలబడే రాము, విద్యావిహీనురాలైన అతని తల్లి నా కళ్లముందు ప్రత్యక్షమవుతారు.

ఇదంతా నీ కెందుకు వ్రాస్తున్నానంటే మన యీ హిందూసంఘంలో భారతస్త్రీ పిల్లల్ని సరిగా పెంచడంచేతకాక ఏవిధంగా తన మాతృత్వాన్ని సతీత్వాన్ని నాశనం చేసుకుంటుందో నీకు తెలియచేయాలని.

ఇంకొకరోజున ఏమైందో తెలుసా? మా ఇంటిప్రక్క పెద్దనూతిమీద రాము నిలబడ్డాడు; ఇటు అటూ చూస్తున్నాడు. నాకేమిటో రాము నూతిలో దూకడానికి సంకోచిస్తూ ఉన్నాడా అని అపరిమితమైన భయంవేసింది. వెంటనే వెనుకగుండా వెళ్లి అతని కుడిచేయి పట్టుకున్నాను. నేనే కొంచెం ఆలస్యంగా వెళ్లినట్లయితే ఇంకొక క్షణంలో రాము నూతిలో ఉండేవాడు. "నన్నెందుకు పట్టుకున్నారు?" అని ఏడవడం మొదలుపెట్టేడు. అతనిని చూస్తే ఎంతో జాలివేసింది. బాలుడు అలా పసితనంలో జీవితంలో మాధుర్యంలేనట్టు ఆత్మహత్య చేసికోవాలని ప్రయత్నిస్తుంటే కళ్లారచూచి ఎంత కఠినమనస్కురాలైనా కన్నీళ్లు కార్చకుండా ఉంటుందా? మొహం చేతులూ కడిగి "రామూ, అలాదూకితే చచ్చిపోరూ?" అన్నాను. అతని కళ్లవెంట అశ్రువులు ఏకధారగా కారిపోతున్నాయి. నేనేమీచేయలేక అలా అతన్ని కౌగలించుకొని "నీకు తెలియదు రామూ, నాప్రాణం నీవు......అలాదూకితే..." ఏడ్చాను. ఈ అనుభవాలన్నీ తలపుకు తెచ్చుకుంటే పొంగి పొరలివస్తుంది మరల దుఃఖము నాకు. "నూతిలోనన్నాపడి చావు వెధవా, పీడన్నా వదులుతుంది" అని వాళ్లమ్మ ఎన్నో దెబ్బలు కొట్టిందట. వాళ్ల నాన్నగారితో చెప్పితే ఇంకా కొట్టేరట. ఇదంతా ఎందుకంటే ఎవరో కుఱ్ఱవాడు తన్ను కొట్టే తను తిరిగి కొట్టినందుకు. ఈ సంగతంతా చెప్పి ఎంతో ఏడ్చాడు. పాపం. "నేనున్నానుకదూ నీకు. వాళ్లంతా నిన్నలాగే

చూస్తారు. నీవు నాదగ్గిరకురా రోజూ” అని బుజ్జగించి పంపేను. అప్పటినుంచి నా మాట తీయ డతను. వాళ్లమ్మా వాళ్లు “ఎవరినీ కొట్టవేరా రామూ?” అంటే, “అమ్మా, పిన్నికి కష్టంగా ఉంటుంది” అంటాడట. అలా మారిపోయాడతను.

ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే రాముతప్పు శారీరకంకాదని అది మానసిక మని గ్రహించగల శక్తి ఆ అజ్ఞానులైన తల్లిదండ్రులకు లేదని వ్రాయడానికి. ప్రేమ కోసరం, ఆదరణకోసరం ఎంత తహతహ లాడిందో ఆ చిన్నిమనస్సు వాళ్లకు తెలియదు. శరీరాన్ని శిక్షించి మనస్సును ఆత్మను బాగుచేద్దా మనుకుంటారు. వీర్లు చివరకు మనస్సును క్షీణింపచేసి నాశనం చేసేస్తారు. ప్రేమకై ఆర్చి ఆర్చి తల్లులయొక్క ఆదరణ లేక వెఱ్ఱిగా తిరిగి వాళ్లలో ఎంతమందిని మనం ఎరుగం? ఏప్రేమకోసరం ఆపిల్లలు పరితపిస్తారో ఆప్రేమను మనము ప్రసాదించ గలిగితే వాళ్లు ఎంతో ఉపయోగానికి వస్తారని వీళ్లకు తెలియకపోవడం చాలా హేయం.

ఇప్పుడు నాకు ఆశ్చర్యం వేస్తుంది, రాముమార్పునుగురించి ఆలోచిస్తే. పాపం, తండ్రి పగలంతా కష్టపడి, చెమటలు ఓడ్చి పిల్లలు పడుకున్న తర్వాత గాని ఇంటికి చేరడు; వాళ్లను అతను ఆదరించ డానికి సావకాశమే లేదు. విసుగులో మునిగి తేలే ఆతల్లి పిల్లల్ని కొట్టడంతప్ప ఇంకోటి ఎరుగదు. ఇంకేమవుతుంది. ఆ పిల్లల బ్రదుకు ఏసుఖమెరుగక ఎండిపోక? ఇదే వాళ్ల విరక్తికి లెక్కలేనితనానికి కారణం. ఇది గ్రహించలేకపోయింది సుబ్బు. సుబ్బు ఏమిటి? ఇలా ఎంతమంది చేయడంలేదని నీ ఉద్దేశ్యము?

ఇప్పటికైనా, ఈ నా అనుభవాలన్నీ తలపుకు తెచ్చుకొని కొంతమంది కాకపోతే కొంతమంది అయినా భారతస్త్రీలు బాగు పడవలెనని నాకోరిక. ఈ ఉద్దేశ్యముతోనే నేను నీకు యీ ఉత్తరం వ్రాయుచుం.

ఈవిషయం నీ వెరుగున్నవాళ్ల కంద రకూ తెలియచేయి. సంఘంలో అన్యాయాలని మనకు తెలియక ఎంతమంది జీవితాలని నాశనం చేస్తున్నామో నీవు ఊహించుకోగలవా? ఆవిషయాలన్నీ ఇంకో ఉత్తరంలో.

నిన్ను సదాప్రేమించే
“మణి.”